క్లుప్తంగా

ఆయిల్‌పాం తోటల విస్తరణ మహోత్సవం



ఆయిల్‌పాం మొక్కలు నాటుతున్న దృశ్యం

గొలుగొండ : ఆయిల్‌పాం తోటల పెంపకం వల్ల రైతులు మంచి ఆదాయం పొందుతారని , దీనికి పలు కంపెనీలు, ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తాయని జిల్లా ఉద్యానవనశాఖ అధికారి రహీమ్ తెలిపారు. చిన్నయ్యపాలెం గ్రామంలో ఆయిల్‌పాం తోటల విస్తరణ మహోత్సవ కార్యక్రమం నిర్వహించారు. రైతుల భూముల్లో మొక్కలు నాటారు. జులై 15 నుంచి ఆగస్టు 15 వరకు జిల్లా వ్యాప్తంగా ఈ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఏపీఎంఐపీ జిల్లా అధికారి లక్ష్మి మాట్లాడుతూ ఆయిల్‌పాం తోటలకు సూక్ష్మ బిందుసేద్యం వల్ల ఎన్నోలాభాలు ఉన్నాయన్నారు. తోటల్లో అంతర వంటల సాగు వల్ల రైతులకు రెట్టింపు లాభాలు వస్తాయన్నారు. సాగులో చీడపీడల నివారణకు రైతులకు అధికారులు సూచనలు అందిస్తారన్నారు.

బదిలీ అయిన ఉపాధ్యాయులకు సత్కారం



బదిలీ అయిన ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ప్రధానోపాధ్యాయులు

రావికమతం: మండలంలోని రావికమతం హైస్కూల్, టి. అర్జాపురం, చినపాచిలి, కొత్తకోటల గ్రామాల్లో గల హైస్కూళ్ల ప్రధానోపాధ్యాయులు మల్లికార్జునరావు, అప్పలనాయుడు, కె.ఆర్.ఎస్. నాయుడు, ప్రసన్నకళ, కె.నాగేశ్వరరావులు ఇక్కడ పనిచేస్తూ బదిలీ కావడంతో వారిని నూతనంగా వచ్చిన ప్రధానోపాధ్యాయులను మేడివాడ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు హెచ్‌ఎం రామారావు, దొండపూడి గ్రామానికి చెందిన రిటైర్డ్ హెచ్‌ఎం వెదురుపర్తి నాగేశ్వరరావు, ఎంఈవో బ్రహ్మాజీ తదితరులు శాలువాతో ఘనంగా సన్మానించారు.

వరి నారుమళ్లలో సస్యరక్షణ చర్యలు



శంకరం రైతులతో అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏవో అనసూయ

మాడుగుల రూరల్: రెండు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా శంకరం, తాటిపర్తి గ్రామాల్లో రైతులతో అవగాహన కార్యక్రమంనిర్వహించారు. మండల వ్యవసాయాధికారి ఎం .అనసూయ ప్రస్తుతం ఖరీఫ్ సీజన్‌లో వరి నాట్లు జరుగుతున్న సమయంలో వరినాట్లు వేసే సమయంలో రైతులు తీసుకోవలసిన జాగ్రత్తలపై సూచనలు చేశారు. వరినారుకు పాచి తెగులు సోకిందని, సస్యరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. వారి వెంట తాటిపర్తి, శంకరం గ్రామాలకు చెందిన వీహెచ్‌ఏలు పి.దేవి, ఎస్.స్వప్నతో పాటు ప్రకృతి వ్యవసాయం ఫీల్డ్ సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమ క్వారీలు నిలిపివేయాలి



క్వారీలు నిలుపుదల చేయాలంటూ ఆందోళన చేస్తున్న ప్రజలు

రోలుగుంట : మండలంలో అక్రమంగా నిర్వహిస్తున్న క్వారీలపై సంబంధిత అధికారులు దాడి చేసి క్వారీలు నిలుపుదల చేయాలంటూ బాధిత గ్రామాల వారు బుధవారం ఆందోళన చేశారు. రాజన్నపేట గ్రామస్తులు క్వారీల నుంచి లారీలతో లోడ్ తరలించే మార్గంలో పెద్ద ఎత్తున పాల్గొని నిరసన తెలిపారు. అక్రమ క్వారీలపై మైనింగ్ అధికారులు దాడులు చేసి కేసులు నమోదు చేయాలని, క్వారీల నిర్వహణకు అండగా ఉన్న అధికార పార్టీ నాయకులు తీరు మార్చుకోవాలని నినాదాలు చేశారు. ఈ సమస్యపై తక్షణమే చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు.

విద్యార్థినులు ఆత్మరక్షణ మెళకువలు నేర్చుకోవాలి

దేవరాపల్లి: విద్యార్థినులు ఈవ్‌టీజింగ్, ఆకతాయిల వేధింపులను ఆత్మరక్షణ మెళకువలతో ధైర్యంగా ఎదుర్కోవాలని ఎస్‌ఐ వి.సత్యనారాయణ సూచించారు. ఉపాధ్యయులు సైతం ఈ తరహా శిక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థినులకు 'క్యాపిల్ కోర్స్ ఆన్ డిఫెన్స్ ఇన్ స్కూల్స్' పేరిట ఆత్మరక్షణపై అవగాహన కల్పించారు. కరాటే కోచ్ గెద్దం నగేష్ విద్యార్థినులకు ఆత్మరక్షణ మెళకువలను నేర్పించారు.

- అల్లూరి జిల్లాకు వైద్యాధికారుల బదిలీతో నాతవరం పీహెచ్‌సీకి ఇక్కట్లు
- గ్రామాల్లో వైద్య సేవలు కరువు
- పీహెచ్‌సీలో ఫార్మసిస్టు, స్టాఫ్ నర్సు పోస్టులు ఖాళీ
- ఇన్‌చార్జి వైద్యాధికారితో పీహెచ్‌సీ సేవలు



గత నెల 17న రెగ్యులర్ వైద్యులను నియమించాలని డీఎంఅండ్‌హెచ్‌వో హైమావతిని కోరుతున్న ఎంపీపీ లక్ష్మణమూర్తి



రెగ్యులర్ వైద్యులు, ఫార్మసిస్టు లేని నాతవరం పీహెచ్‌సీ

జీతం ఇక్కడ... ఉద్యోగం అక్కడ!



రోగిని పరీక్షిస్తున్న ఇన్‌చార్జి వైద్యాధికారి ప్రసన్న

నాతవరం : కూటమి ప్రభుత్వం ఇటీవల చేపట్టిన వైద్యాధికారుల బదిలీలతో నాతవరం పీహెచ్‌సీకి సుస్తీ చేసింది. ఇక్కడ పని చేసిన వైద్యాధికారులు ఎం. రాజేష్‌నాయుడుకు వైజాగ్, ప్రసన్నకు నర్సీపట్నం బదిలీ చేశారు. వీరు జూన్ 28వ తేదీన పీహెచ్‌సీలో రిలీవ్ అయి వెళ్లిపోయారు. వారి స్థానంలో అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్తవీధి మండలంలో ధారకొండ, సప్పర్ల పీహెచ్‌సీలో పనిచేస్తున్న వైద్యాధికారులు కె.వి.నాగభూషణరావు, కె.డి.హెచ్ ప్రసన్నకుమార్‌లను నాతవరం పీహెచ్‌సీకి నియమించారు. వారు జూన్ 25న నాతవరం పీహెచ్‌సీలో చేరారు. మరుసటి రోజే వారిని మరలా అల్లూరి సీతారామరాజు జిల్లాలో వారు పనిచేసిన పాత పీహెచ్‌సీలకు డిప్యూటేషన్‌పై తీసుకెళ్లి పోయారు. నాతవరం పీహెచ్‌సీకి అనకాపల్లి డీఎంహెచ్‌వో కార్యాలయం నుంచి రోజుకో వైద్యాధికారి డ్యూటీకి వచ్చేవారు. ఈ విధంగా సుమారు గా నెలరోజుల పాటు రోజుకో వైద్యాధికారి వస్తుండడంతో నాతవరం పీహెచ్‌సీలో రోగులకు వైద్య సేవలు అందక తీవ్ర ఇబ్బందులు పడేవారు. నాతవరం పీహెచ్‌సీలో వైద్యం కాకుండా ఎలాంటి సర్టిఫికెట్లు పొందాలన్నా రెగ్యులర్ వైద్యా



ఫార్మసిస్టుని నియమించక రోగులకు మందులు ఇస్తున్న పీహెచ్‌సీ సిబ్బంది

ధికారి లేక జనం అవస్థలు పడుతున్నారు. పీహెచ్‌సీలో పని చేసే సిబ్బంది జీతాలకు సంబంధించి సంతకాలు అయిన సరే గూడెం కొత్తవీధి మండలం పీహెచ్‌సీకి వెళ్లాల్సిందే. మండల వ్యాప్తంగా జ్వరాల తీవ్రతపై స్థానికులు కలెక్టరు దృష్టికి తీసుకెళ్లారు. 15రోజుల క్రితం కలెక్టరు నాతవరం మండలంలో జ్వరాలు తీవ్రతపై క్షేత్ర స్థాయిలో పరిశీలన చేసి నివేదిక ఇవ్వాలంటూ డీఎంహెచ్‌వో హైమావతి జిల్లా పంచాయతీ అధికారి సందీప్, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం జిల్లా కోఆర్డినేటరు నాగలక్ష్మి, నర్సీపట్నం ఆర్డీవో రమణకు ఆదేశించారు. వారు మూడు రోజుల పాటు మండలంలో అన్ని గ్రామాల్లో స్వయంగా పర్యటించారు. జ్వరాలు ఉన్న గ్రామాల్లో యుద్ధప్రతిపాదికన వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి జ్వరాలు అదుపునకు చర్యలు చేపట్టారు. ఆ సమయంలో నాతవరం పీహెచ్‌సీకి రెగ్యులర్ వైద్యాధికారులను నియమించాలంటూ ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి, స్థానిక ప్రజాప్రతినిధులు డీఎంహెచ్‌వో దృష్టికి తీసుకెళ్లారు. ఆగస్టు మొదట వారంలో రెగ్యులర్ వైద్యులను నియమిస్తామని ఆమె హామీ ఇచ్చారు. అయితే ఇంతవరకూ ఎటువంటి చర్యలు చేపట్టలేదు.

సిబ్బందిపై మరింత భారం..

నాతవరం పీహెచ్‌సీ పనిచేసి నర్సీపట్నం బదిలీ అయిన వైద్యాధికారి ప్రసన్నను మరల ఇక్కడకు ఇంచార్జిగా నియమించారు. ఈ పీహెచ్‌సీలో ఇద్దరు వైద్యాధికారులు రోగులను పరీక్షించేవారు. రోజుకు 100 నుంచి 150 మధ్య రోగులు వైద్యం కోసం వస్తున్నారు. ప్రస్తుతం వైద్యాధికారి ఒక్కరే కావడంతో వైద్యసేవలకు ఇబ్బంది కలుగుతోంది. గతంలో ఇక్కడ పని చేసే ఫార్మసిస్టు కూడా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ఇంకా ఎవరినీ నియమించలేదు. దీంతో పీహెచ్‌సీ సిబ్బందే రోగులకు మందులు అందిస్తున్నారు. రోగుల తాకిడి అధికంగా ఉండడంతో గునుపూడి పీహెచ్‌సీలో పని చేస్తున్న ఫార్మసిస్టును మూడు రోజుల పాటు నాతవరం పీహెచ్‌సీలో పని చేసేలా నియమించారు. గతంలో ఇక్కడ పని చేసే స్టాఫ్ నర్స్ అనివార్య కారణాలతో ఉద్యోగ విరమణ చేశారు. ఆ స్థానంలో ఎవరికీ నియమించలేదు.

జ్వరాలతో అల్లాడుతున్న జనం

మండల వ్యాప్తంగా జ్వరాలతో ప్రజలు అల్లాడిపోతున్నారు. మండలంలో పి.జగ్గంపేట, సుందరకోట, సరుగుడు, డి.యర్రవరం, తోరడ గ్రామాల్లో పలువురు రోగాలతో మరణించారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై డీఎంహెచ్‌వో హైమావతిని వివరణ కోరగా ప్రస్తుతం కొత్తగా వచ్చే వైద్యాధికారులకు కౌన్సెలింగ్ అవుతుందని, నాతవరం పీహెచ్‌సీ సమస్య త్వరలోనే పరిష్కారం అవుతుందని అన్నారు.

గొలుగొండలో స్ప్రేయింగ్ పనులు

గొలుగొండ : గొలుగొండలో బుధవారం పంచాయతీ పరిధిలో ఉన్న వీధిల్లో స్ప్రేయింగ్ పనులు నిర్వహించారు. సర్పంచ్ కసిపల్లి బుజ్జి, కార్యదర్శి రమణ ఆధ్వర్యంలో సిబ్బందితో దోమలు వ్యాప్తి చెందకుండా చర్యలు చేపట్టారు. పంచాయతీ పరిధిలో అన్ని కాలువల్లో, మురుగునీరు ఉన్న ప్రాంతాల్లో దోమల నివారణకు చర్యలు తీసుకున్నట్టు చెప్పారు. వైద్యాధికారులు సూచనల మేరకు పంచాయతీని శుభ్రం చేయించడం జరగుతుందన్నారు.

స్మార్ట్‌మీటర్లకు వ్యతిరేకంగా నిరసన

- విద్యుత్ బిల్లుల దహనం..కొవ్వొత్తులతో నిరసన



చింతలపూడిలో కొవ్వొత్తులతో నిరసన చేపడుతున్న సీపీఎం మండల కార్యదర్శి దొర తదితర్లు

దేవరాపల్లి: పేద ప్రజలకు, రైతులకు నష్టం కలిగించే స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ప్రభుత్వం తక్షణమే రద్దు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి బి.టి. దొర డిమాండ్ చేశారు. ఈ మేరకు చింతలపూడి పంచాయతీ శివారు కోరాడలో కొవ్వొత్తులతో నిరసన చేపట్టారు. విద్యుత్ బిల్లులను దహనం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇళ్లు, షాపులు, రైతుల పంప్‌సెట్‌లకు స్మార్ట్ మీటర్లను బిగించి ట్రూ ఆఫ్ చార్జీల పేరిట ప్రజలపై ఆర్థిక భారం మోపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు బాదుడే బాదుడు కార్యక్రమంలో లోకేష్ మాట్లాడుతూ స్మార్ట్ మీటర్లు బిగిస్తే పగలకొట్టాలని పిలుపునిచ్చి, అధికారంలోకి వచ్చాక ఎందుకు మాట మార్చారని నిలదీశారు. ఇది ముమ్మాటికీ రైతులను, ప్రజలను మోసగించడమేనని, దీనికి కూటమి ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు.

గౌరిగెడ్డ దిగువన 40 ఎకరాల్లో నాట్లు



నాట్లుకు దమ్ముపట్టిన రైతు



నాట్లు జరుగుతున్న దృశ్యం

గొలుగొండ: గౌరిగెడ్డ పుణ్యమాని గెడ్డ కింద 40 ఎకరాల్లో నాట్లు జరుగుతున్నాయి. మండలంలో నారుమడులు ఎండిపోతున్న తరణంగా ఈ గెడ్డ దిగువన రైతులకు మేలు జరుగుతుంది. ప్రతి ఏటా ఈ గెడ్డపై ఆధారపడి ఉన్న పంట భూములకు నీరు సరిపోవడం జరుగుతుంది. బుడ్డడపాడు ప్రాంతంలో ఉన్న ధారకొండ దిగువన ఉన్న గౌరి గెడ్డపై ఎక్కడా పంట భూములు లేవు. కొద్దిపాటి నీరు ప్రవహిస్తే చాలు ఒకే చోట ఉన్న 40 ఎకరాల భూముల్లో నాట్లు పడుతుంటాయి. ఈ ఏడాది తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఉన్న తరుణంలో రైతులు వచ్చిన కొద్ది పాటి నీరును వృధా చేయకుండా ఒకరి తరువాత ఒకరు నాట్లు వేస్తున్నారు. కుంత్సం మాగాణీగా ఉన్న 40 ఎకరాల్లో ప్రస్తుతం నాట్లు జరుగుతున్నాయి. గెడ్డ నుండి నీరు వృథాగా పోకుండా రైతులు జాగ్రత్తలు తీసుకొని నీటిని పొదుపుగా వాడకం వల్లనే 40 ఎకరాల్లో నాట్లు పూర్తి అవుతున్నట్లు ఇక్కడ సాగు చేస్తున్న రైతులు తెలుపుతున్నారు.

నాతవరం ఇన్‌చార్జి ఎంఈవోగా బ్రహ్మాజీ



నూతన ఇన్‌చార్జి ఎంఈవోను సత్కరిస్తున్న ఎంఈవో-2 వరహాలబాబు కార్యాలయ సిబ్బంది

నాతవరం : మండల విద్యాశాఖ ఇన్‌చార్జి ఎంఈవో -1గా ఎస్.బ్రహ్మాజీని నియమించడంతో బుధవారం నాతవరం ఎంఆర్సీ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ ఇన్‌చార్జి ఎంఈవోగా గొలుగొండ మండలం రెగ్యులర్ ఎంఈవో సత్యనారాయణ పనిచేసేవారు. ఆయన స్థానంలో ప్రభుత్వం ఇన్‌చార్జి ఎంఈవోగా నర్సీపట్నం బాలికల హైస్కూల్లో పనిచేస్తున్న బ్రహ్మాజీని నియమించారు. ఈ సందర్భంగా బాధ్యతలు చేపట్టిన బ్రహ్మాజీని ఎంఈవో -2 వరహాలబాబు, ఎంఆర్సీ కార్యాల యం సిబ్బంది శ్రీనివాసనాయుడు, దంగేటి సాంబ, బి.నాయుడు, సీఆర్పీలు వెంకటలక్ష్మి గోవిందు, నాగేశ్వరరావు, సత్యవేణి మర్యాద పూర్వకంగా కలిసి ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

ఎంఈవో-1గా ఈశ్వరరావు

మాడుగుల : మండల విద్యాశాఖాధికారి -1 గా జి. ఈశ్వరరావు బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన దేవరాపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల నుంచి పదోన్నతిపై మాడుగుల ఎంఈవోగా వచ్చారు.



ఎంఈవో ఈశ్వరరావు

ఉపాధ్యాయులకు అందుబాటులో ఉంటూ ప్రభుత్వ పాఠశాలలు బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. ఎంఈవో -2 బి.దేముడమ్మ, సీఆర్పీలు అచ్చుతరావు, సురేష్, బొబ్బిలి హరికృష్ణ, శారద, ఎంఆర్సీ సిబ్బంది నాగేంద్ర, రాజు తదితరులు పాల్గొన్నారు.

రావికమతం ఎంఈవో-1గా లింగమూర్తి

రావికమతం : మండల ఎంఈవో-1గా ఎం.లింగమూర్తి బుధవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. నర్సీపట్నం హైస్కూల్‌లో తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న ఆయనకు రావికమతం మండల ఎంఈవో-1గా పూర్తి బాధ్యతలు అప్పగిస్తూ డీఈవో ఆదేశాలు జారీ చేశారు.



ఎంఈవో లింగమూర్తి

ఈ మేరకు ఆయన బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో అన్ని పాఠశాలలో విద్యాస్థాయి అభివృద్ధికి, మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం అమలుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఇంతవరకు ఇక్కడ ఎంఈవోగా పనిచేసిన తలుపులు నర్సీపట్నం ఎంఈవోగా కూడా పనిచేస్తున్నారు. ఇప్పుడు నర్సీపట్నం ఎంఈవోగా ఆయన పూర్తి బాధ్యతలు తీసుకున్నారు.

పేద విద్యార్థులకు సైకిళ్ల వితరణ



విద్యార్థులకు సైకిళ్లను అందజేస్తున్న వీవీ చారిటబుల్ ట్రస్టు ఎండీ రమణ, ఎంఈవోలు

దేవరాపల్లి : మండలంలోని తామరబ్బ ప్రాథమికోన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులకు వి.వి.చారిటబుల్ ట్రస్టు మేనేజింగ్ డైరెక్టర్ వి.వి.రమణ ఏడు సైకిళ్లను వితరణగా అందజేశారు. తామరబ్బలోని యూపీ స్కూల్‌కు చింతలపూడి పంచాయతీ శివారు గ్రామాల నుంచి నిత్యం 10 నుంచి 12 కిలోమీటర్ల మేర రాకపోకలు సాగిస్తున్న విద్యార్థులకు బాసటగా నిలిచారు. ఆ పేద విద్యార్థులు పడుతున్న కష్టాలను స్థానిక ఉపాధ్యాయుల ద్వారా తెలుసుకున్న ఆయన తక్షణమే స్పందించారు. ఒక్కో సైకిల్‌ను రూ.6 వేలు చొప్పున ఏడు సైకిళ్లను కొనుగోలు చేసి స్థానిక మండల విద్యాశాఖ అధికారి-1, ఎంఈవో-2 వి. ఉషారాణి, సర్పంచ్ టోకురి రామకృష్ణ, ఎంపీటీసీ బండి గౌరమ్మ, ఉప సర్పంచ్ గుమ్మడపు దేవి చేతుల మీదుగా బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు సొంత సొమ్ముతో సైకిళ్లను సమకూర్చి మానవత్వం చాటిన వి.వి.చారిటబుల్ ట్రస్టు ఎండీ రమణను ఎంఈవోలు, సర్పంచ్, ఉప సర్పంచ్, ఎంపీటీసీ, ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు గుమ్మడపు మహేష్, మంగరాజు, పైడిరాజు, హెచ్‌ఎం కె. కృష్ణ, ఉపాధ్యాయులు కె. సుభాష్ చంద్రబోస్, గిరిబాబు, దొర, సీఆర్పీ రమణ పాల్గొన్నారు.

దేవదాయశాఖ భూముల పరిశీలన

కశింకోట: మండలంలోని వెదురుపర్తి గ్రామంలో గల దేవదాయ శాఖకు చెందిన పంట భూములను బుధవారం ఆ శాఖ అనకాపల్లి అసిస్టెంట్ కమిషనర్ సుధారాణి పరిశీలించారు. వీటి కౌలు నిర్ణయించడానికి ఇటీవల వేలం పాట నిర్వహించేందుకు ప్రయత్నించారు. ఎక్కువ మంది రైతులు పాల్గొనకపోవడంతో వాయిదా వేశారు. దీంతో కొందరు అభ్యంతరం తెలిపిన నేపథ్యంలో ఆ భూములను పరిశీలించారు.ఆమె వెంట ఈవో సత్యనారాయణ మూర్తి ఉన్నారు.

తల్లిపాలతో పిల్లల్లో రోగనిరోధక శక్తి

ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ సూర్యలక్ష్మి



గర్భిణులకు సీమంతం చేస్తున్న పీడీ సూర్యలక్ష్మి, జెడ్పీటీసీ రమణమ్మ



దొండపూడిలో అవగాహన ర్యాలీ



నాతవరం : అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఐసీడీఎస్ అధికారులు, ప్రజాప్రతినిధులు



దేవరాపల్లి సమావేశంలో మాట్లాడుతున్న వైద్యాధికారి వనజ, సీడీపీవో లలితకుమారి

నర్సీపట్నం : తల్లిపాలు పిల్లల్లో రోగనిరోధక శక్తి పెంచుతాయని ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ ఎన్. సూర్యలక్ష్మి పేర్కొన్నారు. నర్సీపట్నం ఐసీడీఎస్ కార్యాలయంలో తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా అవగాహన సదస్సు బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పీడీ, జెడ్పీటీసీ సుకల రమణమ్మ హాజరయ్యారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ పుట్టిన బిడ్డలకు విధిగా తల్లిపాలు పట్టాలన్నారు. దీనివల్ల శరీర వృద్ధిని మెరుగుపరుస్తుందని, పిల్లల్లో మానసిక వికాసాన్ని ప్రోత్సహిస్తాయని అన్నారు. తల్లీ-బిడ్డల మధ్య బంధాన్ని బలపరుస్తాయన్నారు. జెడ్పీటీసీ రమణ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో అందిస్తున్న పౌష్టికాహారాన్ని తల్లులు, పిల్లలు వినియోగించుకోవాలన్నారు. అనంతరం ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో ఏర్పాటు చేసిన బ్రెస్ట్ ఫీడింగ్ సెంటర్‌ని ప్రారంభించారు. గర్భిణులకు సీమంతం చేశారు. కార్యక్రమంలో సీడీపీవో రమణి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నాతవరం : తల్లి పాలు బిడ్డకు తాగించడం అన్ని విధాలుగా శ్రేయస్కరమని గొలుగొండ ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారి శ్రీగౌరి అన్నారు. మండలంలో బుధవారం చమ్మచింత, మన్యపురట్ల, ఎం.బి.పట్నం, నాతవరం గ్రామాల్లో అవగాహన సదస్సు నిర్వహించారు. వీధుల్లో ప్రజాప్రతినిధులు, అంగన్‌వాడీ లబ్ధిదారులు, ఐసీడీఎస్ అధికారులతో తల్లి పాల ప్రాధాన్యంపై అవగాహన కల్పించారు. సీడీపీవో శ్రీగౌరి మాట్లాడుతూ ముర్రుపాలలో బిడ్డ ఆరోగ్యానికి దోహదపడే అనేక రకాల పోషకాలు ఉంటాయన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు కె.విజయ కుమారి విజయలక్ష్మి, నాగజ్యోతి, మాజీ వైస్ ఎంపీపీ బాపన్ననాయుడు, మాజీ సర్పంచ్ సూర్యారావు పాల్గొన్నారు.

రావికమతం: దొండపూడిలో అంగన్‌వాడీ కేంద్రాల్లో బుధవారం ఘనంగా తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. అంగన్‌వాడీలు మాట్లాడుతూ గర్భిణిగా ఉన్నప్పుడే సరైన పౌష్టికాహారం తీసుకుంటే ఆరోగ్యమైన బిడ్డకు జన్మనిస్తారని, బిడ్డ పుట్టిన గంట లోపు ఇచ్చే ముర్రు పాలు బిడ్డకు మొదటి టీకా వంటివని,బిడ్డకు వ్యాధి నిరోధక శక్తిని పెంచడంతో పాటు, తల్లి,బిడ్డకు అనుసంధానం పెంచుతుందని తెలిపారు. రెండు సంవత్సరాల వరకు కచ్చితంగా బిడ్డకు తల్లి పాలు ఇవ్వాలని, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇచ్చే పౌష్టికాహారం క్రమం తప్పకుండా తీసుకోవాలని వివరించారు. అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు,ఆశాలు,మహిళా పోలీసు, ఏఎన్‌ఎం పాల్గొన్నారు.

దేవరాపల్లి: తల్లి పాలు బిడ్డకు అమృతంతో సమానమని కె.కోటపాడు ఐసీడీఎస్ సీడీపీవో లలిత కుమారి అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో తల్లిపాల వారోత్సవాలలో భాగంగా బాలింతలు, గర్భిణులకు బుధవారం అవగాహన సదస్సును నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం సరఫరా చేస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పీహెచ్‌సీ వైద్యాధికారి డి.వనజ మాట్లాడుతూ తల్లిపాలు ఇవ్వడం వల్ల తల్లులు బరువు తగ్గడంతో పాటు గర్భాశయం త్వరగా సాధారణ స్థితికి చేరుకుంటుందన్నారు. అనంతరం గర్భిణులకు సీమంతాలు, చిన్నారులకు అన్నప్రాసన చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పెంటమ్మ, ఎంపీటీసీ కృష్ణమూర్తి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు రాములమ్మ, ఆదిలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు వరలక్ష్మి, గాయత్రి పాల్గొన్నారు.


సమయపాలన పాటించండి



సచివాలయ సిబ్బందితో సమావేశమైన ఎంపీడీవో సీతారామస్వామి

రావికమతం : మండలంలో గల సచివాలయ సిబ్బంది అందరూ సమయపాలన పాటించాలని ఎంపీడీవో సీతారామస్వామి ఆదేశించారు. ఇటీవల బదిలీపై వచ్చిన సచివాలయ సిబ్బందితో ఆయన బుధవారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలు సకాలంలో ప్రజలకు అందేలా చూడాలని సూచించారు.

ఓవర్ లోడు వాహనాలపై కేసులు నమోదు



అధిక లోడు వాహనాలను కాటా వేస్తున్న రవాణాశాఖ అధికారులు

నర్సీపట్నం : రోడ్లు, వంతెనలు దెబ్బతినడంతో ఓవర్ లోడు వాహనాలపై కేసులు నమోదు చేస్తున్నామని ఎం.వి.ఇన్‌స్పెక్టర్ వెంకటరావు తెలిపారు. జిల్లా రవాణా అధికారి ఆదేశాల మేరకు నర్సీపట్నం , విశాఖ వెళ్లే మెయిన్ రోడ్డులో అధిక లోడుతో వెళ్లే వాహనాలను నిరోధించేందుకు కన్నూరుపాలెం వద్ద చెక్‌పోస్టు ఏర్పాటు చేశామన్నారు. నిబంధనలు అతిక్రమించిన వాహనాలపై కేసులు నమోదు చేసి జరిమానా వేస్తున్నామన్నారు. రెండు రోజుల వ్యవధిలో అధిక లోడు కలిగిన రెండు వాహనాలపై సుమారు రూ.70 వేలు జరిమానా వేశామన్నారు.

పంటల బీమా సద్వినియోగం చేసుకోండి




దేవరాపల్లిలో రైతులకు పంటల సాగు, బీమాపై అవగాహన కల్పిస్తున్న ఏవో కాంతమ్మ

దేవరాపల్లి : పంటల బీమా పథకం పరిధిలోకి వరి పంటను కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిందని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి ఎల్.వై. కాంతమ్మ సూచించారు. దేవరాపల్లి, చేనులపాలెం గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఏవో కాంతమ్మ మాట్లాడారు. వరి పంటకు బీమా చేసుకునేందుకు ఈ నెల 15 వరకు మాత్రమే గడువు ఉందని, ఎకరానికి రూ. 84 ప్రీమియం చెల్లించాలన్నారు. తుపానులు, కరువు, అకాల వర్షాలు తదితర ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట నష్ట జరిగితే బీమా సొమ్ము చెల్లిస్తారన్నారు. గ్రామం యూనిట్‌గా పంట కోత ప్రయోగాలు చేసి తద్వారా వచ్చిన దిగుబడి ఆధారంగా బీమా చెల్లిస్తారన్నారు. బ్యాంకుల్లో పంట రుణాలు తీసుకోలేని రైతులంతా సమీప కామన్ సర్వీసెస్ సెంటర్, గ్రామ సచివాలయాలు, పోస్టాఫీస్‌లలో సైతం పంటల బీమా చేయించుకోవచ్చునని వివరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ విస్తరణ అధికారి ఎస్.కిరణ్‌కుమార్, స్థానిక అగ్రికల్చర్ అసిస్టెంట్లు, రైతులు పాల్గొన్నారు.

నక్కపల్లిలో బల్క్ డ్రగ్ పార్కు పేరిట విధ్వంసం

- సీపీఎం నాయకుల అరెస్టు దుర్మార్గం
- సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు వెంకన్న ధ్వజం



దేవరాపల్లి : నక్కపల్లిలో బల్క్ డ్రగ్ పార్క్ భూసేకరణ కోసం విధ్వంసం సృష్టించి పోలీసుల వలయంలో ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టడం దారుణమని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు డి.వెంకన్న ధ్వజమెత్తారు. దేవరాపల్లిలో బుధవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. ప్రజాభిప్రాయ సేకరణకు హాజరు కాకుండా సీపీఎం, ప్రజాసంఘాలు, ఇతర వామపక్ష నాయకులను ముందస్తు అరెస్టులు చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. బల్క్ డ్రగ్ పార్క్ కోసం భూ సేకరణ చేపట్టొద్దని స్థానిక ప్రజలు మొర పెట్టుకుంటున్నా పట్టించుకోకుండా బలవంతపు సేకరణకు సిద్ధం కావడం దుర్మార్గమన్నారు. నక్కపల్లి తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణకు పూర్తి స్థాయిలో ప్రజలను రాకుండా అడ్డుకొని, కొందరినే అనుమతించారన్నారు. పెద్ద ఎత్తున బారికేడ్లు పెట్టి పెద్ద సంఖ్యలో పోలీసులను మోహరించి నిర్బంధ వాతావరణంలో ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టడం సరికాదని, దీనికి ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. ప్రజల జీవితాలను సంక్షోభంలోకి నెట్టే ప్రభుత్వ విచక్షణ రహిత భూసేకరణ విధానాలకు వ్యతిరేకంగా ఐక్య పోరాటానికి ప్రజలంతా సిద్ధం కావాలని వెంకన్న పిలుపునిచ్చారు.